క్లుప్తంగా

థ్యాంక్యూ పీఎం సార్..



బడ్జెట్‌లో నిధులు కేటాయించినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్న విశ్వకర్మలు

కర్నూలు(సెంట్రల్‌): కులవృత్తులను ఆధారంగా చేసుకొని జీవనం సాగించే విశ్వకర్మల కోసం బడ్జెట్‌లో తొలిసారి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టడం ఎంతో సంతోషకరమని విశ్వకర్మ కులస్తులు తులసయ్యాచారి, వడ్డె సుమంతాచారి, సూర్యప్రకాష్‌ ఆచారి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌ ఎదుట థ్యాంక్యూ పీఎం నరేంద్రమోదీ సార్‌ అంటూ ప్లకార్డులు పట్టి హర్షం వ్యక్తం చేశారు. ఎంతో వెనుకబడిన విశ్వకర్మల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేపట్టిన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ‘స్పందన’

కర్నూలు(సెంట్రల్‌): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్‌ పి.కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్‌, మునిసిపల్‌ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పారదర్శకంగా విద్యుత్‌ బిల్లులు

కర్నూలు(రాజ్‌విహార్‌): విద్యుత్‌ బిల్లులు పారదర్శకంగా తీసేందుకు చర్యలు చేపట్టాలని కర్నూలు రూరల్స్‌ ఏడీఈ వై.సుబ్బన్న అన్నారు. ఆదివారం ఆయన కింది స్థాయి సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారి బిల్లులు తీయడంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వీటిపై మీటర్‌ రీడర్లకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు ఇవ్వాలని, ప్రతి ఇంటి మీటర్‌ వద్దకు వెళ్లి రీడింగ్‌ స్కాన్‌ చేసే బిల్లింగ్‌ తీసేలా చూడాలన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్‌



డాక్టరేట్‌ పొందిన ఎస్‌.ఫక్రున్నీసా బేగం

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో జంతుశాస్త్రం అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఎస్‌.ఫక్రున్నీసా బేగంకు పద్మావతి మహిళ యూనివర్శిటీ డాక్టరేట్‌ ప్రకటించినట్లు ఆమె ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మావతి యూనివర్శిటీ జీవశాస్త్ర, సెరీకల్చర్‌ విభాగా ప్రొఫెసర్‌ సావిత్రి పర్యవేక్షణలో బాంబిక్స్‌ మోరి పట్టుపురుగుల శరీర ధర్మాలపై బవేరియా బాసియానా శిలీంద్రాల ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈమెకు ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌ పి.కళావతి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సాహిత్య రచన జరగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్‌: సమాజ చైతన్య దీపికలుగా సాహిత్య రచన జరగాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్‌ టీజీవీ కళాక్షేత్రంలో కవి డప్పోల రమేష్‌ సంపాదకత్వంలో వచ్చిన ‘ఎండ్లూరి కవన కళ స్మారక స్వరం’ పుస్తక పరిచయ సభ జరిగింది. అతిథులు, వక్తలుగా ప్రముఖ కవులు మారుతి, భార్గవ, వెంకటకృష్ణ, పాణి, డాక్టర్‌ అరుణ, కెంగార మోహన్‌ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఆధునిక కవిత్వం మల్లె మొగ్గల గొడుగులా కవిత్వపు నీడనిస్తున్న ఉద్యమ కవిత్వాన్ని అక్షరీకరించిన ధిక్కార కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌ అన్నారు. ఆయన ఈ కాలపు మహోజ్వలిత దళిత ఉద్యమకారుడని అన్నారు. ఎండ్లూరి కవిత్వం నిండా ఆర్తి, ఆర్ద్రతలే ఉంటాయన్నారు. కవులు జంధ్యాల రఘుబాబు, అయ్యన్న, ఎస్‌డీవీ అజీజ్‌ , ఏవీరెడ్డి, సయ్యద్‌ జహీర్‌ అహ్మద్‌, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్‌ : పఠాన్‌, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్‌, వారసుడు, రైటర్‌ పద్మభూషన్‌, బుట్ట బొమ్మ
వీ మెగా ఆనంద్‌ సినీ కాంప్లెక్స్‌ : వీర సింహారెడ్డి, మైఖేల్‌, వాల్తేరు వీరయ్య, వారసుడు, రైటర్‌ పద్మభూషన్‌, బుట్ట బొమ్మ
వెంకటేష్‌ సినీ కాంప్లెక్స్‌ : వాల్తేరు వీరయ్య, మైఖేల్‌, రైటర్‌ పద్మ భూషన్‌, బుట్ట బొమ్మ
ఐనాక్స్‌ : అవతార్‌ ది వే ఆఫ్‌ వాటర్‌, పఠాన్‌, ది ఉమన్‌ కింగ్‌, రైటర్‌ పద్మభూషన్‌, రెబెల్స్‌ ఆఫ్‌ తుపాకుల గూడెం
భరత్‌ కాంప్లెక్స్‌ : రెబెల్స్‌ ఆఫ్‌ తుపాకుల గూడెం, పఠాన్‌, సువర్ణ సుందరి
రాజ్‌ : తెగింపు, బుట్ట బొమ్మ
శ్రీరామ : ప్రేమదేశం
విజయ : పఠాన్‌

సంక్షేమ సారథి సీఎం వైఎస్‌ జగన్‌

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్‌ రామయ్య
- 26, 35వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్‌ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్‌ పరిధి 26వ వార్డు 67వ వార్డు సచివాలయం పరిధిలోని కృష్ణానగర్‌, తారక రామానగర్‌, 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలో ఉమామహేశ్వర్‌నగర్‌లలో ఆయా వార్డుల కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతరెడ్డి, సాపురు మాధురి, వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు ఎమ్మెల్యే, మేయర్‌కు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి వారు ప్రజా సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే కాలనీల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అర్హతే ప్రమాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫారసులు, నాయకుల అండదండలు ఉండే వారికే పథకాలు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, మిద్దె చిట్టెమ్మ, పల్లె శారద, విక్రమసింహారెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, కేడీసీసీ బ్యాంక్‌ డైరెక్టర్‌ కల్లావెంకట రమణారెడ్డి, డీఏఏబీ చైర్మన్‌ మహేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్‌, నంద్యాల పార్లమెంటరీ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, బాలచంద్రారెడ్డి, సత్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎం. సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుందర నగరంగా కర్నూలు

కల్లూరు: కర్నూలును సుందర నగరంగా తీర్చిదిద్దుతామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్‌ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్‌ 26వ వార్డులోని సవారమ్మ గుడి దగ్గర రూ. 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు



26వ వార్డులో డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్‌

శంకుస్థాన చేశారు. అలాగే రూ. 14లక్షలతో నూతనంగా నిర్మించిన శానిటేషన్‌ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, మేయర్‌ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి కర్నూలును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చిలో విద్యుత్‌ సర్కిల్‌ డే

కర్నూలు(రాజ్‌విహార్‌): విద్యుత్‌ కర్నూలు సర్కిల్‌ డే వేడుకలను మార్చిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్‌ ఎస్‌ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు సర్కిల్‌ కార్యాలయం, కర్నూలు, ఆదోని, నంద్యాల డివిజన్ల టీమ్‌ల వారీగా క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు.

అలరించిన మధుర గీతాలు

కర్నూలు(హాస్పిటల్‌): ఘంటసాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో ఆర్కెస్ట్రా కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపాత మధురాలు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్‌ మియ ప్రారంభించారు. అనంతరం పాత సినిమాలతో పాటు కొత్త సినిమాల్లోని పాటలను ఇబ్రహీం, హబీబ్‌, శివప్రసాద్‌, సంతోషి, రాగిని బృందం ఆలపించి అందరినీ ఆకట్టుకుంది.

ఆర్టీసీ పురోగతి కోసం పడిన శ్రమ వెలకట్టలేనిది



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణ శాఖ అధికారి వెంకటరామం



ఆత్మీయ సమావేశానికి హాజరైన రిటైర్డు అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్‌): రోడ్డు రవాణ సంస్థ పురోగతి కోసం పడిన శ్రమ వెలకట్టలేనిదని ప్రజా రవాణ శాఖ జిల్లా అధికారి టి. వెంకటరామం అన్నారు. ఆదివారం స్థానిక రాజ్‌విహార్‌ సమీపంలోని జ్యోతి మాల్‌ సమావేశపు హాలులో 1983 బ్యాచ్‌ ట్రాఫిక్‌ సూపర్‌వైజర్ల ఆత్మీయ సమావేశం రిటైర్డు డిపో మేనేజరు కేడీఎస్‌ ప్రసాద్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1983లో సంస్థ పరిస్థితి ఎంతో బాగుండేదన్నారు. ఆ తరువాత కొన్ని కారణాలతో నష్టాలు ఎదుర్కొంటూ వచ్చిందన్నారు. అలాంటి సమయంలో సూపర్‌వైజర్లు, అసిస్టెంట్‌ మేనేజర్లు, డిపో మేనేజర్లుగా విధులు నిర్వహించిన మీ సేవలు ఎంతో విలువైనవి అన్నారు. బస్సుల నిర్వహణ, ఉద్యోగుల సమస్యలు, కార్మిక సంఘాల నాయకులు ఒత్తిళ్లు, పై అధికారుల ఆదేశాలు, ధర్నాలు, సమ్మెలు ఇలా అనేక సమస్యలు ఎదురవుతున్నా.. వాటిని అధిగమించుకుంటూ ముందుకు వెళ్లారని కొనియాడారు. వారి సేవల పట్ల అభినందనలు తెలిపారు. మిగిలిన శేష జీవితం ఆరోగ్యంగా, ఉల్లాసంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం రిటైర్డు డీఎం కేడీఎస్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ తాము సూపర్‌వైజర్లుగా ఉద్యోగంలో చేరి ఇప్పటికే 40 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. తమ సర్వీసులో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, సంస్థ పురోగతి, కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశామని పేర్కొన్నారు. తోటి మిత్రుల సమస్యలు తెలుసుకునేందుకు ఆత్మీయ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్‌ ట్రాఫిక్‌ మేనేజరు కేవీ రమణ, రిటైర్డు డిపో మేనేజర్లు గద్వాల ఈరన్న, సీఎంఎస్‌ రెడ్డి, అజహర్‌, సోమశేఖరరెడ్డి, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణకు చెందిన ఆ బ్యాచ్‌ రిటైర్డు అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి నిర్వహణ నేర్చుకోవాలి

కర్నూలు(హాస్పిటల్‌): ఒత్తిడిని పూర్తిగా తొలగించలేమని, కానీ దానిని ఎలా నిర్వహించుకోవాలో ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని గుంటూరుకు చెందిన సైకాలజిస్టు డాక్టర్‌ ప్రత్యూష సుబ్బారావు చెప్పారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడం ఎలా అనే అంశంపై ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యం లేకపోవడం, మనసు వారి ఆధీనంలో లేకపోవడం వల్ల ఒత్తిడి వస్తుందన్నారు. ఎంతటి ఒత్తిడినైనా వరంగా మార్చుకునే అవకాశం మనిషికి ఉందన్నారు. ఇందుకోసం పలు సూచనలు పాటించాలని చెప్పారు. అనంతరం ఆయనను ఫౌండేషన్‌ కార్యదర్శి డాక్టర్‌ పి.చంద్రశేఖర్‌, ఉపాధ్యక్షులు డాక్టర్‌ భవానీప్రసాద్‌, చంద్రశేఖర కల్కూర తదితరులు సన్మానించారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్‌): ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర హజ్‌ కమిటీ సభ్యుడు హాఫీజ్‌ మంజూర్‌ అహ్మద్‌ అన్నారు. ఆదివారం స్థానిక వడ్డేగేరిలోని మర్కజ్‌ ఏ ఇస్లామియా అహ్లెహదీస్‌ మసీదులో మేనేజింగ్‌ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులతో ఈసీజీ, మధుమేహ, బీపీ, ఇతర రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, వాతావరణ మార్పుల కారణంగా యుక్త వయసులోనే హార్ట్‌ అటాక్‌ తదితర కారణాలతో ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. దీంతో పాటు బీపీ, షుగర్‌ లాంటి జబ్బులు మనిషి శరీరంలోకి తెలియకుండానే వచ్చి జీవిత కాలం ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించడంతో పాటు వ్యాయమం, ఆధ్యాత్మికం, తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాల్సిన అవసరం వస్తోందన్నారు. డైట్‌ కంట్రోల్‌ పాటిస్తేనే మరింత మంచిదని సూచించారు. కార్యక్రమంలో మసీదు మేనేజింగ్‌ కమిటీ అధ్యక్షుడు ఇలియాస్‌ బాషా, కార్యదర్శి అబ్దుల్‌ హమీద్‌, కోశాధికారి అబ్దుల్‌ రహమాన్‌ ఖాన్‌, సభ్యులు, వైద్యులు డాక్టర్‌ పి.అబ్దుల్‌ సమద్‌, డాక్టర్‌ ఎస్‌.అబ్దుల్‌ సమద్‌, దాదాబాషా, నౌషద్‌, డాక్టర్‌ అబ్దుల్‌ అజీజ్‌, డాక్టర్‌ సల్మా తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోండి



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బెల్లం మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్‌): 2022–23 ఖరీఫ్‌లో వాతావరణ సమస్యలు, అధిక వర్షాలు, చీడపీడల కారణంగా పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వీరిని తగిన విధంగా ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని కోరినట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌, రాష్ట్ర మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి తెలిపారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి హాజరైన నేపథ్యంలో అక్కడ మెమోరాండం సమర్పించినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాధారం కింద సాగు చేసిన పత్తికి వాతావరణ ఆధారిత బీమా సదుపాయం ఉందని, వాతావరణ మార్పుల వల్లనే పంట దెబ్బతిన్నందున బీమా ద్వారా అన్నదాతలను ఆదుకోవాలని కోరినట్లు చెప్పారు. వచ్చే ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలోని అన్ని ఆర్‌బీకేల ద్వారా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను అమ్మించే ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీటికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు డీఏఏబీ చైర్మన్‌ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

సేవాస్తంభ్‌కు పూర్వ వైభవం తీసుకొద్దాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మునిస్వామి

కర్నూలు(అర్బన్‌): జిల్లాలో అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగ సంఘాల సమాఖ్య (సేవాస్తంభ్‌) కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు జిల్లా అధ్యక్షులు మునిస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక ఇరిగేషన్‌ సర్కిల్‌ ప్రాంగణంలో సేవాస్తంభ్‌ జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కన్వీనర్‌ పూల వీరయ్య, కేంద్ర కమిటీ సభ్యులు డీపీ సోమన్న, ప్రధాన కార్యదర్శి గోపాల్‌, ఫైనాన్స్‌ సెక్రెటరీ గుర్రాల శ్రీనివాసులు, నాయకులు టీడీ గోవర్ధనగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సు, ఐక్యత కోసం స్వర్గీయ దామోదరం సంజీవయ్య స్థాపించిన సేవాస్తంభ్‌ను జిల్లాలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా సంఘం కార్యకలాపాలు విస్తరించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు జీతాలు, జీపీఎఫ్‌, ఏపీజీఎల్‌ఐ, సరెండర్‌ లీవ్‌ తదితర వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉందన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు సేవాస్తంభ్‌ కృషి చేయనుందన్నారు.

నాణ్యమైన ఎరువులు పంపిణీ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్‌): వ్యవసాయ చట్టాలు, క్వాలిటీ కంట్రోల్‌పై పూర్తి అవగాహన పెంచుకొని, ఇందుకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరఫరా చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు ఇన్‌పుట్‌ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్‌ హాల్‌లో దేశీ డిప్లొమా కార్యక్రమం కింద ఇన్‌పుట్‌ డీలర్లకు క్వాలిటీ కంట్రోల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎరువుల నియంత్రణ చట్టం –1985లోని ముఖ్యమైన విషయాలను ఇన్‌పుట్‌ డీలర్లకు వివరించారు. డీలర్లు కేంద్రప్రభుత్వం గుర్తించిన రసాయన, సేంద్రియ, బయోస్టిములైన్స్‌, నూనె తీసిన వేప, ఆముదం, కానుగ చెక్కలను మాత్రమే మార్గదర్శకాలకు లోబడి విక్రయించాలని సూచించారు. అన్ని రకాల ఎరువుల తయారీదారులు సెంట్రల్‌ లైసెన్స్‌ తీసుకోవాలన్నారు. లైసెన్స్‌ తీసుకునే విధానం, రికార్డుల నిర్వహణ గురించి వివరించారు. ఎరువుల తనిఖీ అధికారి వచ్చినపుడు అన్ని రకాల రికార్డులను చూపాలన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశీ ఇన్‌పుట్‌ డీలర్లకు పంటల చీడపీడలు చిత్ర పటాలు గీసేందుకు డ్రాయింగ్‌ రిజిష్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేశీ సమన్వయకర్త, విశ్రాంత ఏడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



స్కూల్‌ గేమ్స్‌ పవర్‌ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్‌): 66వ రాష్ట్ర స్థాయి స్కూల్‌ గేమ్స్‌ పవర్‌ లిఫ్టింగ్‌ పోటీలు ఈ నెల 2 నుంచి 4 వరకు జగ్గయ్యపేటలో జరిగాయి. ఇందులో కర్నూలుకు చెందిన అండర్‌–17 విభాగంలో సి మేఘన, బీ సుమియా, రేష్మలు రజత పతకాలు సాధించారు. వి.భవాని, గురు చిద్విలాస్‌లు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు ఆదివారం ఔట్‌డోర్‌ స్టేడియంలో జరిగిన అభినందన సభలో జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ముఖ్య కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ముఖ్య కార్యదర్శి వెంకటేశ్వర్లు క్రీడాకారులు, కోచ్‌ అండ్‌ మేనేజర్లు యూసుఫ్‌, నాగేశ్వరిని అభినందించారు. రాష్ట్ర స్థాయిలో బాలికలు టీమ్‌ ఈవెంట్‌లో 3వ స్థానంలో నిలిచారని జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ముఖ్య కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. ఈ ఏడాది స్కూల్‌ గేమ్స్‌లో ఎన్నో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ సెక్రటరీ శేఖర్‌, కిశోర్‌, జిల్లా పవర్‌ లిఫ్టింగ్‌ సెక్రటరీ వేణుగోపాల్‌ పాల్గొన్నారు.

పిల్లల్లో ఎదుగుదల లోపాలను గుర్తించాలి

కర్నూలు(హాస్పిటల్‌): పిల్లలో ఎదుగుదల లోపాలను త్వరగా గుర్తించి చికిత్స అందించాలని ఒంగోలుకు చెందిన చిన్నపిల్లల వైద్యులు, ఐఏపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్‌ మురళీధర్‌రెడ్డి చెప్పారు. చిన్నపిల్లల్లో వచ్చే ఎదుగుల లోపాల గురించి ఇండియన్‌ అకాడమి ఆఫ్‌ పీడియాటిక్స్‌(ఐఏపీ) కర్నూలు బ్రాంచ్‌ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మెడికల్‌ కాలేజీలోని ఆడిటోరియంలో వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుకు తగ్గ పిల్లలు ఎదుతున్నారా లేదా అని చికిత్స కోసం వచ్చిన తల్లిదండ్రులను వైద్యులు అడిగి తెలుసుకోవాలన్నారు. పిల్లల్లో ఎదుగుదల లోపాలు, మానసిక ఎదుగుదల లోపాలుంటే త్వరగా గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఇలాంటి పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఏపీ కర్నూలు అధ్యక్షులు డాక్టర్‌ కుమారస్వామిరెడ్డి, కార్యదర్శి డాక్టర్‌ రత్నాకర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్‌ కిశోర్‌కుమార్‌, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్‌ డాక్టర్‌ శారద, డాక్టర్‌ రవికుమార్‌, అసోసియేట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ మల్లికార్జున, డాక్టర్‌ శ్రీలత, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ ప్రకాష్‌ ఆనంద్‌, డాక్టర్‌ నాగార్జున, సీనియర్‌ వైద్యులు డాక్టర్‌ సుధాకర్‌, డాక్టర్‌ రఫిక్‌ పాల్గొన్నారు.

ఐక్యతతో క్రీడాభివృద్ధికి కృషి చేద్దాం

- జిల్లా ఒలింపిక్‌ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు (టౌన్‌): జిల్లాలోని క్రీడా సంఘాలు అన్ని కలిసి కట్టుగా ఐక్యతతో క్రీడాభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్సీ, జిల్లా ఒలింపిక్‌ సంఘం అడ్‌హాక్‌ కమిటీ చైర్మన్‌ కేఈ ప్రభాకర్‌ అన్నారు. ఆదివారం స్థానిక రాజ్‌విహార్‌ సమీపంలోని కేఈ ప్లాజాలో కన్వీనర్‌ మల్లికార్జునరెడ్డి అధ్యక్షత జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం, ఒలింపిక్‌ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడం , క్రీడాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షకులుగా శిక్షకుడు కాశీరావు, ఆంధ్రప్రదేశ్‌ ఒలింపిక్‌ సంఘం నుంచి వైఎస్సార్‌ జిల్లా ఒలింపిక్‌ సంఘం అధ్యక్షులు సమరనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల రిటర్నింగ్‌ అధికారిగా న్యాయవాది సుభాన్‌ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేఈ జగదీప్‌కుమార్‌ (అధ్యక్షులు), జి.శ్రీనివాసులు (ప్రధాన కార్యదర్శి), శ్రీధర్‌ (కోశాధికారి), ఎస్వీ గంగాధర్‌ గౌడ్‌, శోభన్‌బాబు, రాజశేఖర్‌, ఎస్‌.అహ్మద్‌ షరీఫ్‌ (ఉపాధ్యక్షులు) అవినాష్‌, శ్రీనివాసులు, వేణుగోపాల్‌, నరసింహులు (సంయుక్త కార్యదర్శులు), కార్యవర్గ సభ్యులుగా డాక్టర్‌ రుద్రారెడ్డి, ఆదినారాయణ, సురేంద్ర ఎంపికయ్యారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు విజయ్‌కుమార్‌, సునీల్‌కుమార్‌, సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘హిందువులంతా పుణ్యాత్ములే’



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాణేష్‌

కర్నూలు(హాస్పిటల్‌): హిందూ ధర్మంలో పాపులు, పతితులూ ఎవ్వరూ లేరని, హిందువులంతా పుణ్యాత్ములేనని, ఒకవేళ పాపం చేస్తే దైవదర్శనంతో అది తొలగిపోతుందని విశ్వహిందూ పరిషత్‌ రాష్ట్ర సహకార్యదర్శి ప్రాణేష్‌ చెప్పారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్‌ కార్యాలయంలో సంత్‌ రవిదాస్‌ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాణేష్‌ మాట్లాడుతూ సంత్‌ రవిదాస్‌ గురించి వివరించారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 15 వరకు ధర్మరక్షానిధి పేరుతో సంస్థ ఆర్థిక అవసరాల కోసం హిందు సమాజం నుంచి ధనాన్ని సేకరించాలని, ప్రతి కార్యకర్త కనీసం 20 మందిని కలిసి విశ్వహిందూ పరిషత్‌ గురించి వివరించి ఆర్థిక సహాయాన్ని అర్థించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్‌ సేవా కన్వీనర్‌ గురుమూర్తి, జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్‌, జిల్లా సహ కార్యదర్శి శివప్రసాద్‌, కోశాధికారి అయోధ్య శ్రీనివాసరెడ్డి, జిల్లా సంఘటనా కార్యదర్శి వడ్లు భూపాలచారి, నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలిలో ల్యాంప్‌ లైటింగ్‌ ఉత్సవ్‌

కర్నూలు(హాస్పిటల్‌): నగరంలోని గీతాంజలి నర్సింగ్‌ కాలేజీలో ఆదివారం ల్యాంప్‌ లైటింగ్‌ ఉత్సవ్‌ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కరస్పాండెంట్‌ పెరగు విజయవర్ధన్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి నర్సింగ్‌ విద్యార్థి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి, రోగులకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ప్రభుత్వ నర్సింగ్‌ కాలేజీ వైస్‌ ప్రిన్సిపాల్‌ రోజారమణి మాట్లాడుతూ.. విద్యార్థులు నర్సింగ్‌ వృత్తికి వన్నెతెచ్చేలా మెలగాలని, ప్రస్తుత సమాజానికి నర్సింగ్‌ విద్యార్థి పాత్ర ఎంతో కీలకమైనదన్నార. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కిమ్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ అర్చన, గీతాంజలి కళాశాల ప్రిన్సిపాల్‌ వసంతకుమారి, అధ్యాపకులు శిరీష, సురేఖ, సౌజన్య పాల్గొన్నారు.

‘సురేష్‌కుమార్‌ను సర్వీస్‌ నుంచి తొలగించాలి’

కర్నూలు సిటీ: యూటీఎఫ్‌ రాష్ట్ర నాయకుడిగా పని చేస్తున్న కె.సురేష్‌కుమార్‌ను సర్వీసు నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. డోన్‌ మండలంలోని చిన్నమల్కాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సురేష్‌ బయోలాజికల్‌ సైన్స్‌ టీచర్‌గా పని చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎంఈడీ కోర్సుకు వేతనంతో కూడిన సెలవులు ఉపయోగించుకున్నారని, దీనిపై 2017లో ఫిర్యాదులు చేసినా అప్పటి డీఈఓ పట్టించుకోలేదన్నారు. ఇటీవల మరోసారి ఫిర్యాదు చేయడంతో నేడు(సోమవారం) డోన్‌ డిప్యూటీ డీఈఓ విచారణ చేపట్టనున్నారన్నారు. జేడీ సర్వీస్‌గా పని చేస్తున్న మువ్వా రామలింగం సురేష్‌ను కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. 2020లో ప్రభుత్వ బీఈడీ, డైట్‌ కాలేజీల్లో డిప్యూటేషన్లను రద్దు చేశారని, కానీ సురేష్‌కుమార్‌ను వెనువెంటనే డిప్యూటేషన్‌పై నియమించడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు.

విద్యార్థులు తైక్వాండో సాధన చేయాలి

కర్నూలు (న్యూటౌన్‌): విద్యార్థినీ, విద్యార్థులు ఆత్మరక్షణకు తైక్వాండో సాధన చేయాలని అవోపా అధ్యక్షులు గొన్నూరు యుగంధర్‌శెట్టి అన్నారు. ఆదివారం స్పోర్ట్స్‌ అథారిటీ ఇండోర్‌ స్టేడియంలో తైక్వాండో బెల్ట్‌ గ్రేడింగ్‌ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవోపా అధ్యక్షులు హాజరై మాట్లాడుతూ స్పోర్ట్స్‌ అథారిటీ సహకారంతో సమ్మర్‌ క్యాంప్‌లు నిర్వహించామని అన్నారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర ,జాతీయ స్థాయిలో పాల్గొని ఎన్నో విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థినులు చిన్నతనం నుంచే సెల్ఫ్‌ డిఫెన్స్‌ తైక్వాండో సాధన చేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బెల్ట్‌ గ్రేడింగ్‌ పోటీలు నిర్వహించి విద్యార్థినీ, విద్యార్థులకు బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో జాయింట్‌ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు, చీఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ సాయి కృష్ణ, తిలక్‌, అఖిల్‌, మల్లేష్‌, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పర్‌భద్ర ప్రాజెక్టును నిలుపుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్‌): కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టును వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే ఏపీలోని ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎల్‌సీకి, కేసీ కెనాల్‌ కింద ఉన్న వ్యవసాయ భూములు బీడు పడాల్సి వస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కేవలం ఎన్నికల కోసం లేని ప్రాజెక్టుకు జాతీయ హోదాను కట్టబెట్టి రూ.5300 కోట్లను కేటాయించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌ఎన్‌ రసూల్‌, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్‌కు యూటీఎఫ్‌ వ్యతిరేకం

కర్నూలు(సెంట్రల్‌): ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన జీపీఎఫ్‌కు యూటీఎఫ్‌ వ్యతిరేకమని ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్‌ పేర్కొన్నారు. ఆదివారం ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్‌ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ పిలుపు మేరకు సంకల్ప దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సీపీఎస్‌కు బదులుగా జీపీఎస్‌ను చేపట్టాలని ప్రతిపాదించిందన్నారు. అయితే దీనిని తమ సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. పూర్తిగా పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నదే తమ సంఘం లక్ష్యమన్నారు. సీపీఎస్‌ రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు మాట్లాడారు. కాగా ఈ దీక్షకు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతులనాగరాజు మద్దతు తెలిపారు.